# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 326 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 23 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# బిజెపి.. కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలు

## లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం.. గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు

## ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత.. రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

## నగరంలో పలువురు కాంగ్రెస్, బిజెపి నేతల అరెస్ట్

**హైదరాబాద్, జులై 22 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు





తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు ..మిగతా 2లో



## కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

### కొడంగ్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్

**వికారాబాద్, జులై 22 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కొడంగల్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరె-స్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేందప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై ..మిగతా 2లో

---

గత 10 ఏళ్లల్లో 152

## పేపర్ లీక్ ఉదంతాలు



### ఒక్క కేసులో కూడా దోషులను తేల్చలేదు

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

### ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే

### మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ, జులై 22 (నమస్తే ఉదయం)**

గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని ..మిగతా 2లో

## హన్మకొండలో ఆందోళన.. పాల్గొన్న భట్టి, కొండా సురేఖ

### రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

### కేంద్రం తీరుపై మండిపడ్డ డిప్యూటి సీఎం భట్టి

**హన్మకొండ, జులై 22 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన



వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న ..మిగతా 2లో

## కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు

### కాంగ్రెస్ ఓట్లు తొలగించాలని బిజెపి ఎత్తులు

### ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి

### సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సిఎం రేవంత్



**వికారాబాద్, జులై 22 (నమస్తే ఉదయం)**

కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్‌ఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని సిఎం అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ..మిగతా 2లో


ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే

## నీట్‌పై చర్చ

### రాజ్యసభలో తేల్చి చెప్పిన కాంగ్రెస్ నేత ఖర్గే

**న్యూఢిల్లీ, జూలై22 (నమస్తే ఉదయం)**

నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తేల్చి చెప్పారు. బుధవారం రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 'నీట్ అంశంపై నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ..మిగతా 2లో





## రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

2లో..

### వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్

### 2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

### దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్'

### అప్పుల రీస్ట్రక్చరింగ్‌తో డిస్కంలను నంబర్-1గా తీర్చిదిద్దే ప్రణాళికలు

### ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

# బిజెపి.. కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలు





మొదటి పేజీ తరువాయి...

జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్-ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.



# కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు

మొదటి పేజీ తరువాయి...

ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.







# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

మొదటి పేజీ తరువాయి...

చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు.

అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.



ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అఃఞాఇలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# హన్మకొండలో ఆందోళన.. పాల్గొన్న భట్టి, కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి...

అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

### ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే

# నీట్‌పై చర్చ

మొదటి పేజీ తరువాయి...

చేయాలి. ఆయన రాజీనామా చేసేంతవరకు ఎలాంటి చర్చా ఉండదు' అని అన్నారు. దీనిపై లీడర్ ఆఫ్ ది హౌస్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. 'ప్రభుత్వం చర్చకు వెనకడుగు వేయడం లేదు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పుడే చాలా స్పష్టంగా చెప్పారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన అన్ని విషయాలపై కూడా చర్చించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాది పారదర్శకమైన ప్రభుత్వం' అని అన్నారు. ్÷లింద్ర ప్రభుత్వం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కానీ, ప్రతిపక్షాలు నిరసనలతో సభను అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. 'మీరు సభ జరగకుండా అడ్డుకోవాలన్న ఆలోచనతో ఉంటే.. అది కచ్చితంగా మంచి పద్ధతి కాదు' అని అన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

### సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పొంగులేటి

**హైదరాబాద్,జూలై22 (నమస్తే ఉదయం)**

పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి తెలిపారు.

# రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

### ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

**హన్మకొండ, జులై 22 (నమస్తే ఉదయం)**

'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు. అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందుచూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగు తున్నామన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనేదే లేదని, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, లైన్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. 'ప్రజా బాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు. గతంలో ఎక్కువ వడ్డీలతో తెచ్చిన పాత రుణాలను 'రీస్ట్రక్చరింగ్' చేయడం ద్వారా సంస్థల రుణభారం తగ్గించి, డిస్కంలను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. గతంలో వైద్యారోగ్య శాఖలో 108 ఆంబ్యులెన్స్ సేవలు తీసుకొచ్చిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతో పాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఈ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర్1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు (ంఎ) సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి, ఆటోమేటిక్‌గా క్షణాల్లో సమాచారాన్ని ఆంబ్యులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని... మెసేజ్ ఆధారంగా ఆంబ్యులెన్స్ నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరిస్తుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ... విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ. 1.20 కోట్లు బీమా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. అలాగే లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందించినట్లు పేర్కొన్నారు. మరోవైపు 'గృహజ్యోతి' పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కం కంపెనీలకు చెల్లిస్తోందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అయ్యే ?రూ. 14,000 కోట్ల సబ్సిడీ నిధులను? కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.

## మాటలు కోటలు దాటుతున్నాయి...

# సైబరాబాద్ ట్రాఫిక్ 'గడప' దాటడం లేదు!

**వారానికి మూడు మీటింగ్‌లు.. పేపర్లలో హంగామా.. తీరా వర్షం పడితే చుక్కలే!**

**ఐటీ ఉద్యోగులు, ప్రజల నరకయాతన.. సమన్వయం లేని అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం**

**శేరిలింగంపల్లి : జూలై 22,(నమస్తే ఉదయం)**



ఐటీ కారిడార్లు ట్రాఫిక్ సమస్య పరిష్కారాన్ని పరిశీలిస్తున్న సమన్వయ కమిటీ సభ్యులు

"సైబరాబాద్ పరిధిలో ఇక ట్రాఫిక్ కష్టాలు ఉండవు.. ఐటీ ఉద్యోగులు హ్యాపీగా ఆఫీసులకు వెళ్లొచ్చు పోవచ్చు" వారంలో కనీసం రెండు మూడు రోజులు టెలికాన్ఫరెన్స్‌లు, కోఆర్డినేషన్ మీటింగ్‌లు పెట్టి అధికారులు ఇచ్చే బిల్డప్ ఇది! పత్రికల్లో కలర్‌ఫుల్ వార్తలు చూసి, ఇక తమ కష్టాలు తీరిపోయాయని నమ్మే వాహనదారులకు.. ఒక్క చిన్న జల్లు పడితే చాలు అసలు నిజ రూపం కళ్లముందు కదలాడుతోంది. ప్రచారం కోసమే ఆరాటపడే అధికారుల పనితీరు "మాటలు కోటలు దాటుతాయి.. పని మాత్రం గడప దాటదు" అన్న చందంగా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నరకానికి ప్రతిరూపం.. ఐటీ కారిడార్!**

గత మూడు రోజులుగా సాయంత్రం వేళల్లో కురుస్తున్న వర్షాలకు సైబరాబాద్ రోడ్లన్నీ స్తంభించిపోయాయి. పగటిపూట అయినా, రాత్రి అయినా సరే.. ఐటీ ఉద్యోగులకు ట్రాఫిక్ చుక్కలు చూపిస్తోంది. కిలోమీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలతో గంటల తరబడి రోడ్లపైనే మగ్గిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఐటీ సెక్టార్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

**ప్రచారానికే పరిమితమైన 'కార్ పూలింగ్'!**

రోడ్లపై వాహనాల సంఖ్యను తగ్గించేందుకు తీసుకొచ్చిన "కార్ పూలింగ్" విధానం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైంది. ప్రత్యామ్నాయ మార్గాలు చూడకపోవడం, ఐటీ కంపెనీల ప్రతినిధులతో సరైన సమన్వయం లేకపోవడంతో కార్ పూలింగ్ కొండెక్కింది. కొందరు ఉద్యోగాలకు కార్ పూలింగ్ విషయము తెలియక

ఎవరి కార్ లో వారే వస్తున్నారు. వర్షానికి భయపడి అందరు కార్లలో కూడా కొంత ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతుంది. దీంతో రోడ్లపై ట్రాఫిక్ ఒత్తిడి దారుణంగా పెరిగింది. ఇప్పటికైనా అధికారులు ఐటీ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై కార్ పూలింగ్‌ను పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ఎస్సీఎస్సీ ఆధ్వర్యంలో నాలుగు వందల మంది పైచిలుకు ఐటి ఉ ద్యోగాలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ సేవలు అందించేవారు. హైడ్రా సిబ్బంది రావడంతో ఐటి ఉద్యోగాల వినియోగాన్ని తగ్గించినట్లు ప్రచారం జరుగుతుంది. ఎంత మంది ఉన్న ఏమీ లాభం వాహనాలు సంఖ్యకు తగ్గట్టుగా రోడ్డు వెడల్పు చేయాలి రోడ్డు వైడింగ్ చేస్తే స్థలం పోతున్న యజమానులకు నష్టం పరిహారం చెల్లించాలి ప్రభుత్వం దగ్గర ఖజానా ఖాళీ. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్ని సమావేశాలు పెట్టుకున్న లాభం లేదంటున్నారు వాహనదారులు ఐటి ఉద్యోగాలు.

**సమన్వయ లేమి.. సగానికి పైగా నిర్లక్ష్యం!**

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, సీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ తదితర విభాగాలు ఏకతాటిపైకి రాకపోవడమే ఈ దుస్థితికి కారణం. గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు చేతులెత్తేశారు. ఆలస్యమవుతున్న 'ఫ్రీ లెఫ్ట్‌లు జంక్షన్లలో నిర్మించాల్సిన ఫ్రీ లెఫ్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు వాహనాలు సులువుగా మళ్లేందుకు 'ఫ్రీ లెఫ్ట్' పాయింట్లు ఏర్పాటు చేసినా రోడ్డు మధ్యలోనే ఉన్న కరెంట్ స్తంభాలను తొలగించడంలో విద్యుత్ శాఖ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీనివల్ల ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ మరింత జామ్ అవుతోంది.

**ప్రజల ఆక్రోశం.. ఇకనైనా కళ్ళు తెరవండి!**

రివ్యూ మీటింగ్‌లు కేవలం పేపర్ కవరేజీల కోసం కాకుండా, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఉపయోగపడాలని ప్రజలు, ఐటీ ఉద్యోగులు కోరుతున్నారు. వర్షాలు పడుతున్న వేళ ముందస్తు ప్రణాళికలు వేసుకుని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తమను ఈ ట్రాఫిక్ నరకం నుంచి కాపాడాలని సైబరాబాద్ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.



## ఎమ్మెల్యే సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారం

**నాయకులు సోమ శ్రీనివాస్**

**రాజేంద్రనగర్,జులై22(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని నాయకులు సోమ శ్రీనివాస్ అన్నారు.బుధవారం బాబుల్ రెడ్డినగర్ లో సుమారు రూ.26 లక్షలతో కొత్తగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి పనులను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవతో స్థానికంగా అనేక సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు.అన్ని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి పరిష్కరించేలా చొరవ చూపుతున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ధనంజయ,ప్రేమ్‌గౌడ్,సరికొండ వెంకటేష్,కాళిదాస్,వీ.మల్లేష్,ఓం ప్రకాష్,లక్మారెడ్డి,పల్లపు జగన్,ఏటీ నాగరాజు,డీ.కృష్ణ,దుర్గాప్రసాద్,శ్రీనివాస్ రెడ్డి,హనుమంత్ సాగర్,కేవీస్ రెడ్డి,విజయలక్ష్మి,శోభా,రవి ముదిరాజ్,పవన్,సోమ సందీప్,రాయుడు,నవీన్, ఎం.శ్రీనివాస్,రాము,వల్లకొండ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మీ సేవ కేంద్రాల్లో అదనపు రుసుములు వసూలు చేస్తే చర్యలు:

**ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ.. మీసేవలో కాగిత రహిత సేవలు....**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 22(నమస్తే ఉదయం)**

గద్వాల మండల పరిధిలోని పలు మీ సేవ కేంద్రాలను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కె. శివ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టిజిటిఎస్, టిఎస్ ఆన్ లైన్ జిల్లా మేనేజర్లతో కలిసి ఆయన ఈ తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా కేంద్రాల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలు, దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఈడీఎం, వీఎల్‌ఈలకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.పౌరుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ భౌతిక పత్రాలను సేకరించి తాసిల్దార్ కార్యాలయాలకు పంపకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్దేశిత సేవా రుసుముల కంటే ఒక్క రూపాయి కూడా ప్రజల వద్ద అదనంగా వసూలు చేయరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రతి దరఖాస్తును ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్వీకరించి, నిర్ణీత గడువులోగా పారదర్శకంగా సేవలు పూర్తి చేయాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే ప్రజలతో వీఎల్‌ఈలు మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

**మీసేవలో కాగిత రహిత సేవలు....**

మీ సేవలో కాగిత రహిత సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చినదని జిల్లా ఇ-డిస్ట్రిక్ మేనేజర్ఎన్. శివ తెలిపారు. బుధవారం గద్వాల మండలంలోని పలు మీ సేవ కేంద్రాలను జిల్లా ఇ-డిస్ట్రిక్ మేనేజర్ శివ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కాగిత రహిత పాలన లో భాగంగా మీ సేవ కేంద్రాల్లో సేవా రుసుము చెల్లించిన అనంతరం ముద్రిత రసీదులు ఇవ్వబడవని, చెల్లింపు వివరాలు నేరుగా వినియోగదా రుల మొబైల్ ఫోన్కు లఘు సందేశం (ఎస్ఎంఎస్) రూపంలో, వాట్సాప్ లలో పంపబడతాయని తెలిపారు. అలాగే, ప్రజలు దరఖాస్తు పత్రాలు పట్టుకొని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగా ల్సిన అవసరం లేకుండా, జిపిఓ ల మొబైల్ యాప్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత అధికారులు వాటిని ఆన్లైన్లోనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం సౌకర్యం కల్పించిందని వివరించారు. ఈ ఆకస్మిక తనిఖీలో టిజిటిఎస్, టిఎస్ ఆన్ లైన్ మేనేజర్లు పాల్గొన్నారు.



శ్రీ అచల గురు ఆశ్రమం లో జరిగిన పూజా కార్యక్రమంలో
పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా తదితరులు

## స్వంత ఖర్చులతో శ్రీ ఆచల ఆశ్రమం పైకప్పు ఏర్పాటు

**బుద్వేల్, జూలై 22 (నమస్తే ఉదయం)**

బాబుల్ రెడ్డి నగర్ లో ఉన్న శ్రీ అచల ఆశ్రమం పై కప్పు ను రూ. 4 లక్షల స్వంత ఖర్చులతో కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా వేయించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన పూజా కార్యక్రమాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. అచల గురుస్వామి ఆశ్రమం పై కప్పు స్వంత ఖర్చులతో వేయించడం సంతోషకరమని సోమ శ్రీనివాస్ గుప్తా ను ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ అభినందించారు. సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టడం మం చిదన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రూ. 26లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభం :**

బాబుల్ రెడ్డి నగర్ లో రూ.26 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు బుధవారం ప్రారంభమైనాయి. ఈ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, ఎన్ ధనుంజయ్, సరికొండ వెంకటేశ్, కాళీదాస్, వి మల్లేశ్ తదితరులు పర్యవేక్షించారు.

## మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

**బుద్వేల్, జూలై 22 (నమస్తే ఉదయం)**



కార్మిక శాఖ మంత్రి జి వివేక్ కు వినతి పత్రం
అందచేస్తున్న కె యేసు రత్నం, వనంపల్లి జైపాల్ రెడ్డి

మున్సిపల్ కార్మికులకు అన్యాయం కలిగించే జీవో నెంబర్ 6ను ఉపసంహరించుకోవాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) రాష్ట్ర అధ్యక్షులు కె ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి లు అన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ ను కలసి వినతి పత్రం అం దజేశారు. అనంతరం వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని కోరారు. దానికి మంత్రి వివేక్ సానుకూలంగా స్పందించారన్నారు. మ ఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల వేతనాలను పెంచడానికి కృషి చేస్తామన్నారు.



రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి

## పార్లమెంటులో చర్చించకుండ ప్రధాని నివాసం ముందు ధర్నాలు చేయడం సరికాదు

**బుద్వేల్, జూలై 22 (నమస్తే ఉదయం)**

పార్లమెంటు ను విస్మరించి రోడ్లపై డ్రామాలాడుతున్న కాం గ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తీరుపై రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నివాసం ముందు రాహుల్ గాంధీ నిరసనకు దిగడాన్ని నిరసిస్తు బుధవారం ఉప్పర్పల్లి చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్బంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో దేవాలయంగా బావించే పార్లమెంట్ లో ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాల్సింది పోయి చట్టవిరుద్ధంగా వీధుల్లోకి వచ్చి దేశ ప్రధాని నరేంధ్ర మోడీ నివాసం వద్ద ధర్నాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సులిగె విఠల్, గోనె శ్రీకాంత్ రెడ్డి, పవన్, పలుగుచెరువు నరేందర్. వనపర్తి భూపాల్, బుర్రి శేఖర్, ఎర్రోళ్ల మనోజ్, సద్దుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ లో సమావేశమైన నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ అధికారులు

## ఎన్ఐఆర్డీపీఆర్‌లో టెక్నికల్ కోర్సులు

**బుద్వేల్, జూలై 22 (నమస్తే ఉదయం) :**

రాజేంద్రనగర్ లో గల జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయ తీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్) ఇక మీదట వృత్తి విధ్యా కోర్సులకు సంబందించిన శిక్షణ కార్యక్రమాలను కూడా చేపట్టనుంది. అందుకోసం బుధవారం నేషనల్ కౌన్సిల్ ఫర్ ఓకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీవీఈటీ) తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఇప్పటి వరకు గ్రామీణాభివృద్ధిలో శిక్షణ కార్యక్రమాలు ఇస్తు వస్తున్న ఆ సంస్థ ఇక మీదట వృత్తి విద్యా, శిక్షణ కార్యక్రమాలను చేపట్టడానికి మార్గాన్ని సుగమం చేసుకుంది. ఎన్సీవీఈటీ కార్యనిర్వాహక సభ్యులు నిరం జన్ కుమార్, ఆ సంస్థ గుర్తింపు విభాగం డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ సౌరబ్ ఎస్ బిష్ట్ తో ఎన్ఐఆర్డీపీఆర్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్, దూర విద్యాకేంద్రం ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ జ్యోతిస్ సత్య పాలన్, ఎన్ఐఆర్డీపీఆర్ కు చెందిన డాక్టర్ సంధ్యా గోపకుమారన్ లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందం అనంతరం ఎన్ఐఆర్డీపీఆర్ లో ఇండస్ట్రీయల్ జనరల్ ఫెస్ట్ మేనేజ్మెంట్ టెక్నిషియన్, పంచాయతీల ద్వారా సొంత వనరుల ఆదాయ సృష్టి, సమీకరణపై మైక్రో క్రెడేన్షియల్ లను ఎన్సీవీఈటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. గ్రామీణ యువత కోసం పరిశ్రమకు సంబందించిన కోర్సులు, స్వయం సహాయక బృందాలకు అనువైన వ్యవస్థాపకత, ఆధారిత కోర్సులు. గ్రామీణాభివృద్ధి పంచాయ తీరాజ్ శాఖల కార్యకర్తల కోసం వృత్తి నైపుణ్య కోర్సుల విభాగాలలో ఎన్సీవీఈటీ ఆమోదించిన కోర్సులను ప్రారంభించవచ్చన్నారు

# సైబర్ నేరగాళ్లకు చెక్.. బాధితులకు రూ.25 కోట్ల రీఫండ్:

**సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల ఘన విజయం!**

**పోయిన డబ్బు మళ్లీ మీ ఖాతాలోకి! సైబరాబాద్ సైబర్ పోలీసుల కృషితో రూ.25 కోట్లు రికవరీ చేసిన సైఫరాబాద్ సైబర్ క్రైం పోలీసులు**

**శేరిలింగంపల్లి : జూలై 22, ( నమస్తే ఉదయం)**



సైబర్ క్రైమ్ డిసిపి పుష్ప..

సైబర్ ఆర్థిక మోసాలకు గురైన బాధితులకు ఊరటనిస్తూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సంచలన విజయం సాధించారు. 2026 జనవరి నుండి జూలై వరకు కేవలం తొలి ఏడు నెలల కాలంలోనే చట్టపరమైన ప్రక్రియలను వేగవంతం చేసి, న్యాయస్థానాల ఉత్తర్వుల ఆధారంగా రూ.25 కోట్లకు పైగా నగదును బాధితులకు తిరిగి అందజేసేలా చర్యలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదులపై పోలీసులు వేగవంతంగా స్పందించడం, మోసపూరిత లావాదేవీలను వెంటనే ఫ్రీజ్ చేయడం, బ్యాంకులు ఆర్థిక సంస్థలతో నిరంతరం సమన్వయం పాటిస్తూ సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించడం వల్లే ఈ స్థాయిలో నిధుల పునరుద్ధరణ సాధ్యమైందని సైబరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి పుష్ప వివరించారు.మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)తో మరింత వేగంగా రీఫండ్‌కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) తోపాటు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ డిజిటల్ వేదిక ద్వారా బాధితులకు నగదు అందించే ప్రక్రియ మరింత వేగంగా పారదర్శకమైందన్నారు. గత ఒక నెల కాలంలోనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ పోర్టల్ ద్వారా సుమారు రూ. 2 కోట్ల రీఫండ్ ప్రక్రియను ప్రారంభించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించే దిశగా కీలక అడుగు వేశారు.

**రీఫండ్ పొందే విధానం ఇలా**

బ్యాంకులు రీఫండ్ మొత్తాన్ని గుర్తించిన తర్వాత, బాధితుడికి ఎస్ఎంఎస్ తోపాటు ఇ-మెయిల్ ద్వారా ఎంఆర్ఎం పోర్టల్ లింక్ వస్తుంది. బాధితులు ఎన్ సి ఆర్ పి అక్‌నాలెడ్జ్‌మెంట్ నంబర్, ఓటీపీతో లాగిన్ అయి తన బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్ కార్డ్ కోర్టు ఉత్తర్వును అప్‌లోడ్ చేయాలి. దర్యాప్తు అధికారి పరిశీలించి ఆమోదించిన వెంటనే, సంబంధిత బ్యాంక్ నేరుగా బాధితుడి ఖాతాలో రీఫండ్ మొత్తాన్ని జమ చేయడం జరుగుతుంది.

"సైబర్ మోసానికి గురైన వెంటనే బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ '1930'కి కాల్ చేయాలి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే నిధులు ఫ్రీజ్ అయ్యి, రికవరీ అయ్యే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. బాధితులు బ్యాంక్ వివరాలను భద్రపరిచి, దర్యాప్తులో పోలీసులకు సహకరించాలని డీసీపీ కె. పుష్ప కోరారు.

# నేరగాళ్లకు 'థర్డ్ ఐ' చెక్.. సైబరాబాద్‌లో జియో ట్యాగింగ్ ఎన్వీఆర్ అప్‌గ్రేడేషన్ వేగవంతం!

## 'నేను సైతం'పై సీపీ ఎం. రమేష్ కీలక సమీక్ష... డీవీఆర్ స్థానంలో ఎన్‌వీఆర్ సాంకేతికతకు ఆదేశం

**శేరిలింగంపల్లి : జూలై 22, (నమస్తే ఉదయం)**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా నేరాల నియంత్రణ భద్రతా వ్యవస్థను మరింత నిఘా నీడలోకి తీసుకురావడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్ పర్యవేక్షణ ఆధునీకీకరణ పై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షతన ఆడిటోరియంలో ఉన్నత స్థాయి సమీక్షా



నేను సైతం సమీక్షా సమావేశం మాట్లాడుతున్న సీపీ రమేష్.

సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని సీసీటీవీ కెమెరాలను తక్షణమే జియో ట్యాగింగ్ చేసి, ప్రతి కెమెరా వివరాలను డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయాలని



హాజరైన పోలీసు అధికారులు.

సీపీ ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కెమెరాకూ ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. డీవీఆర్ నుంచి ఎన్ వీఆర్ సాంకేతికతకు మార్చాలన్నారు. పాతబడిన డీవీఆర్ ఆధారిత సీసీటీవీ వ్యవస్థ స్థానంలో అత్యాధునిక ఎన్‌వీఆర్ సాంకేతికతకు మారే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. దీనివల్ల లైవ్ మానిటరింగ్, ఆధారాల సేకరణ, వీడియో విశ్లేషణ అత్యంత వేగంగా జరుగుతాయని తెలిపారు.

**స్టేషన్ల నుంచి సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు కనెక్టివిటీ**

పోలీస్ స్టేషన్ పరిధిలోని నెట్‌వర్క్‌ను మెయిన్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి స్టేషన్‌లో ఒక ప్రత్యేక అడ్మిన్ ను నియమించనున్నట్లు తెలిపారు. కెమెరాల నిర్వహణ, సాంకేతిక లోపాల తక్షణ పరిష్కార బాధ్యతలను సంబంధిత వెండర్లే వహించాలని సరిగా పనిచేయని కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సిబ్బందికి ప్రాక్టికల్ ట్రైనింగ్ సెషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు సీసీటీవీలే మూలస్తంభాలని ప్రజలు, వ్యాపారవేత్తలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు 'నేను సైతం'లో భాగస్వాములై ప్రధాన రహదారుల వైపు చూసేలా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వైవిఎస్.సుధీంద్రతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సంఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న చందానగర్ సీఐ శ్రీధర్ కుమార్..

# విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్, 'హైడ్రా' సిబ్బందిపై దాడి యత్నం?

## 'నేనెవరో తెలుసా?' అంటూ రచ్చ చేసిన తండ్రీ కొడుకులపై కేసు నమోదు!

**శేరిలింగంపల్లి : జూలై 22,(నమస్తే ఉదయం)**

ప్రజా సౌకర్యార్థం వర్షపు నీటిని తొలగించేందుకు ప్రయత్నించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ తోపాటు 'హైడ్రా' సిబ్బంది విధులకు తీవ్ర ఆటంకం కలిగించిన ఘటనలో ఓ ప్రముఖ డాక్టర్ ఆయన కుమారుడిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చందానగర్ పోలీసుల కథనం ప్రకారం సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నల్లగండ్ల ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సంతోష్ కుమార్ వెంటనే స్పందించారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డుపై నిలిచిన నీటిని పక్కనే ఉన్న ఒక ఖాళీ స్థలంలోకి మళ్లించేందుకు హైడ్రా సిబ్బంది సహాయంతో ఫుట్‌పాత్‌పై ఉన్న మట్టిని తొలగించే ప్రయత్నం చేశారు. ఆ ఖాళీ స్థలం యజమాని డాక్టర్ శరత్ బాబు, ఆయన కుమారుడు అక్కడికి చేరుకుని నీరు తమ స్థలంలోకి రాకుండా అడ్డుకున్నారు. నిలిచిపోయిన నీళ్లు పోకుండా తిరిగి మట్టి వేసి రోడ్డుపైనే నీరు నిలిచిపోయేలా చేసి, కానిస్టేబుల్ విధులకు భంగం కలిగించారు. 'నేనెవరో తెలుసా?' అంటూ బెదిరింపులకు దిగారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో కానిస్టేబుల్ సంతోష్ కుమార్ నిల్వ నీటిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు యత్నించగా, డాక్టర్ శరత్ బాబు మళ్లీ అక్కడికి వచ్చి అడ్డుపడ్డారు. నేనెవరో తెలుసా అంటూ హెచ్చరిస్తూ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌తో పాటు నీటిని తొలగించడానికి వచ్చిన హైడ్రా సిబ్బందిని సైతం పని చేయనివ్వకుండా నిరోధించారు. గత మూడు రోజులుగా ప్రభుత్వ ఉద్యోగులను వారి అధికారిక విధులు నిర్వర్తించకుండా నిరంతరం అడ్డంకులు సృష్టిస్తూ ప్రజా రవాణాకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని కానిస్టేబుల్ సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ శరత్ బాబు తోపాటు ఆయన కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందానగర్ సీఐ శ్రీధర్ కుమార్ తెలిపారు.

# ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 22(నమస్తే ఉదయం)**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు యూబీఐ గద్వాల గాంధీ చౌక్ బ్రాంచ్ మేనేజర్ రాముడు అన్నారు.బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాంధీ చౌక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో "షాప్ టూ షాప్" కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలకు, ఇండ్లకు వెళ్లి తమ బ్యాంకు అందిస్తున్న సేవల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందించడం, ఆర్థిక పరిష్కారాలను తెలియజేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు, క్లరికల్ సిబ్బంది, సబార్డినేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వ్యాపార సంస్థలు, గృహాలను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగదారులతో మమేకమై వారి అవసరాలను తెలుసుకొని తగిన బ్యాంకింగ్ ఉత్పత్తులను పరిచయం చేశారు. పొదుపు, కరెంట్ ఖాతాలు, వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, వ్యవసాయ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బీమా, పెట్టుబడి పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సురక్షితమైన, సులభమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎల్డీఎం శ్రీనివాసరావు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్య పరిష్కారం కోసం వెళ్లిన గ్రామ సర్పంచ్ భర్తపై దాడి.. గాయాలు

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 22(నమస్తే ఉదయం)**

పొలం వివాదానికి సంబంధించి న్యాయం చేయడానికి వెళ్లిన ఓ గ్రామ సర్పంచ్ భర్తపై దాడికి పాల్పడిన ఘటన బుధవారం మలక్దల్ మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో సర్పంచ్ భర్తకు గాయలయ్యాయి. దీంతో దాడికి పాల్పడిన వారిని శిక్షించాలంటూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలం పావనపల్లి గ్రామనికి చెందిన తిరుమలేష్, రాదాకృష్ణలకు గత కొంతకాలంగా గ్రామ శివారులో గల పొలంలో భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఇరువర్గాలు మల్దకల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం గ్రామ సర్పంచ్ రాజేశ్వరీ భర్త రామాంజనేయులు మరి కొంత మంది పెద్ద మనుషులు కలిసి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. రాధకృష్ణ మరికొందరు కలిసి రామాంజనేయులు పై దాడికి పాల్పడటంతో అక్కడ నుంచి ఆయన పరారయ్యాడు. ఈ క్రమంలో రామాంజనేయులును వెంబడించి రాళ్లతో దాడికి పాల్పడటంతో గాయలై ప్రాణాలతో బయటపడాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు , గ్రామ సర్పంచ్ గాయపడిన రామాంజనేయులును చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రి కి తరలించారు.

**కక్ష పూరితంగా రాళ్లతో దాడి: బాధితుడు ఆరోపణ**

రాజకీయ కక్షలు , పొలం వివాదాల నేపథ్యంలో తమపై



జరిగిన భౌతిక దాడిపై న్యాయం చేయాలని పావనపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ రాజేశ్వరి భర్త రామాంజనేయులు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు రామాంజనేయులు మాట్లాడుతూ. గ్రామానికి చెందిన తిరుమలేష్, రాధాకృష్ణల మధ్య పొలం వివాదం నడుస్తుండగా, తనకు ఆ గొడవతో ఎలాంటి సంబంధం లేదని బాధితుడు తెలిపారు. ఇటీవల తమ ఊరి వ్యక్తిని మల్దకల్ పోలీసులు స్టేషన్ కి తీసుకెళ్తుండగా, తిరుమలేష్ ఫోన్ చేయడంతో తాను ఎస్ఐ కలవడం జరిగిందన్నారు. పోలీసుల ఆదేశాల మేరకు, కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మంగళవారం పొలంలో పనులు పూర్తి చేసి ఎస్ఐ శ్రీహరికి సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అయితే, బుధవారం పథకం ప్రకారం తనపై సుమారు 12 మంది వ్యక్తులు రాళ్లతో దాడికి పాల్పడ్డారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి నుంచి తప్పించుకోవడానికి తాను దాదాపు 2 కిలోమీటర్లు పరిగెత్తినా, వెంబడించి మరీ తనపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని తెలిపారు.

తన పై దాడికి పాల్పడిన వారిలో రాధాకృష్ణ, జనార్ధన్, బుచ్చన్న, చిన్న వెంకటేష్, పెద్ద వెంకటన్న, పెద్ద నర్సన్న, లవన్న, కుశలన్న,రామాంజనేయులు, జనార్ధన్ తదితర 12 మంది ప్రమేయం ఉందంటూ వారిపై ఎస్పీ కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పెద్ద పల్లికి చెందిన ఓ నేత ప్రోత్సాహంతోనే తన పై దాడి చేశారంటూ, ఆ నేత పై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులను కోరినట్లు బాధితుడు రామాంజనేయులు వెల్లడించారు.

**ఓర్వలేకనే దాడి: గ్రామ సర్పంచ్ రాజేశ్వరీ**

పావనంపల్లి గ్రామ ప్రజల ఆశీర్వాదంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గ్రామ సర్పంచ్ గా తాను విజయసాధించని సర్పంచ్ రాజేశ్వరీ వెల్లడించారు. సర్పంచ్ ఎన్నికల సమయం నుంచి నేటి వరకు పెద్దపల్లికి చెందిన నాయకుడి అండబలంతో మాజీ సర్పంచ్ వర్గీయులు, మరి కొందరు మమ్మల్మి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆమె కన్నీటితో ఆవేధన వ్యక్తం చేశారు. గ్రామంలో గ్రామ సర్పంచ్ కే రక్షణ కరువైందని, సాదారణ ప్రజలకు రక్షణ ఎక్కడ నుంచి లభిస్తుందని ఆమె అన్నారు.సర్పంచ్ ఎలక్షన్ గెలిచిన నాటి నుంచి సామాన్య వ్యక్తులు రాజకీయాల్లో ఉండకూడదనే ఉద్దేశంతోనే తమపై ఈ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దాడికి ఒడిగట్టిన వారిపై మరియు ప్రేరేపించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ ని కోరినట్లు అమె తెలిపారు.



# వరి నాట్లు వేసి రైతులను ఉత్సాహపరిచిన బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 22 (నమస్తే ఉదయం)**


ధరూర్ మండలంలో పర్యటన భాగంలో బుధవారం ఖమ్మంపాడు గ్రామంలో వ్యవసాయ పొలాల్లోకి నేరుగా వెళ్లిన బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకె స్నిగ్ధారెడ్డి వ్యవసాయ కూలీలతో మమేకమయ్యారు. వరి పొలంలోకి దిగిన ఆమె.. రైతులు మహిళా కూలీలతో కలిసి వరి నాట్లు వేసి, వారి జీవన విధానం, కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నదని అన్నారు. కేంద్రం నుండి వచ్చే సహాయం ప్రతి ఒక్కరికి అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఈసారి వర్షాలు ఆలస్యంగా పడటం వల్ల రైతులు నిరుత్సాహంలో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.




# నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం

**హైదరాబాద్, జూలై 22(నమస్తే ఉదయం)**

జలమండలి విజిలెన్స్ విభాగం అధికారులు బుధవారం శ్రీరాంనగర్ ప్రాంతంలోని పద్మనగర్ వార్డు, డివిజన్--23, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో అక్రమ మోటార్ల వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో తాగునీటి పంపిణీ పైపులైన్లకు అక్రమంగా అనుసంధానించి వినియోగిస్తున్న 4 మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.ఒకవేళ తక్కువ ప్రెజర్ తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.



# అనుమతులు లేకుండా చేపట్టిన మజీద్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

## అనుమతులు లేకుండా మసీదును నిర్మించడం తగదని కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ప్రకాష్ నగర్‌వాసులు

**శంషాబాద్,జులై22(నమస్తే ఉదయం)**

ఎలాంటి అనుమతులు లేకుండా హిందూవుల నివాస సముదాయాల పక్కన మసీదును నిర్మించడం తగదని,ఈ మేరకు నిర్మాణాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని ప్రకాష్ నగర్ కాలనీవాసులతో కలిసి కాలనీవాసులు నర్ర పాండు,నర్ర గిరిలు కోరారు.శంషాబాద్ పట్టణంలోని ప్రకాష్ నగర్ కాలనీ మధ్యలో మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా మసీదును నిర్మించడం తగదని కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి ఆ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు నర్ర పాండు,నర్రగిరిలు మాట్లాడుతూ..ప్రకాష్ నగర్ కాలనీలో ఎక్కువ మంది హిందువులు నివాసం ఉంటున్నారని,అలాంటి కాలనీ దగ్గరలో మసీదును నిర్మించడం వల్ల రెండు మతాల మధ్య గొడవలు జరిగే అవకాశాలు ఉన్నందున తక్షణమే మసీదు నిర్మాణాన్ని ఆపేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.ఇప్పటికే అనేక సందర్భాలలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడం వల్ల కలెక్టర్ నారాయణ రెడ్డికి కలిసి సమస్యను వివరించినట్టు నర్రగిరి తదితరులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్ర శ్రీనివాసులు,నర్ర రామారావు,మక్కల చంద్రశేఖర్,మక్కల ప్రేమ్ కుమార్,మక్కల రాజు,మక్కల జలంధర్ తదితరులు పాల్గొన్నారు..

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733